# పట్టుచీర

శ్రీమతి జి. యల్. భార్గవీదేవిగారు

నాడు విజయదశమి. సాయంత్రం అయిదు గంటలయింది. నారాయణమూర్తిగారు హడావుడిగా యింటికొచ్చారు జేబులో ఓ చిన్నపాకెట్టుతో. అప్పుడే తల దువ్వుకొని ముస్తాబు కాబోతున్నది హైమవతి. దశమిపండగకు తన కేదో తెచ్చారనుకుంది. సంతోషం కనబర్చకుండా కాళ్లకు నీళ్లిచ్చి కాఫీ యిచ్చింది. ఆరోజు కాఫీ రుచిగావున్నది మూర్తిగారికి. కాఫీ పుచ్చుకుంటూ "అత్తయ్యయే"దన్నాడు. "ఆలయానికి వెళ్లా"రంది హైమ. తెచ్చింది దాచిపెట్టటం దేనికనుకున్నారు కామోసు హైమ చేతికిచ్చారు పాకెట్టు. విప్పిచూచుకుంది. చక్కని సిల్కుచీర. చూచేటప్పటికి హైమ అమితానందం పొందింది. నిజనాథుని కేసిచూస్తూ "పండుగరోజు. చక్కనిచీర. మిగిలిందేం"టంది నవ్వుతూ. అప్రయత్నంగా "నీవు కట్టుకోటం" అన్నారు మూర్తిగారు.

నారాయణమూర్తిగారు రామమూర్తిగారి ఏకపుత్రులు. కొద్దిపాటి భూస్థితిగలవారైనా పట్టుదలతో చదివించారు కుమారున్ని. పాపం అక్కడక్కడ మిక్కుటంగా పల్టీలుకొట్టినా చివరకు బి.యె.బి.యల్ అనిపించా డతనుగూడా. స్వగ్రామంలో కోర్టులేనప్పుడు ఎక్కడైతేయేం హైకోర్టులోనే ప్రాక్టీసు పెట్టుమన్నారు కొడుకును. మా అబ్బాయి హైకోర్టు వకీలని నోటూరా చెప్పుకుందాం అనుకున్నాడు కామోసు. పట్నం పిల్లవాన్ని ఒకన్నే పంపడం మనస్కరించలా. అందులో కోడలు చిన్నదిగూడాను. పనంతా ఒక్కతే చేసుకోగలదా? తను కదల్టానికి వీల్లేకపోయింది! సరే పదిమందిపెట్టు పాయమ్మవుంది తీసుకపొ'మ్మన్నారు. పాయమ్మ పాపం చిన్నప్పుడే భర్తృవియోగం చెందింది. అప్పట్నుంచి అన్ననే కనిపెట్టుకొనివుంది. తెలివిగలది. చాకచక్యం గలది. కాబట్టి అంతా ఓ కట్టుబాటులో నడుపుకొస్తున్నది. వదినగూడా వణికేది పాయమ్మ మాటంటే!

మరోగంటకల్లా పాయమ్మ దయచేసింది. శ్రవణానందంగా వాకిట్లోకే వినబడుతున్నది హైమ గొంతు. హార్మోనియంలో కలిపి "పాడువంట ఓ అరగంట ఆలస్యం అయితేయేం హాయిగా విందాం' అనుకుంది. సావిడిదాటి ఆలా గదికేసి చూచింది. కొత్తచీర కట్టుకొన్న హైమ మనోహరంగా పాడుతున్నది హార్మోనియం వాయిస్తూ. ప్రక్క పడక కుర్చీలో మూర్తిగారున్నారు. అంతా ఆనందమయం. సాయిగా వంటయింట్లోకిపోయి మడికట్టుకుంది. భోజనాలదగ్గర వస్తుంది గదా చీర ప్రసంగం, అత్తయ్యకు నచ్చచెప్తాం అనుకున్నాడు మూర్తిగారు. నాతో చెప్పకుండా కొనుక్కున్నప్పుడు నే నడగటం దేనికనుకుంది పాయమ్మ. హైమ అమాయికురాలు. పట్టుదలలోమాత్రం పాయమ్మకు తీసిపోదు. మాటవరుసన "పిన్నీ చూచారా మీ అల్లుడుగారు తెచ్చా"రంటూ పమిట చెంగుచూపింది. "తెచ్చేది వాడు కట్టుకునేదానివి నీవు మధ్య నాదేముంది" అంది పాయమ్మ. అన్నం ముందు కూర్చోబోతున్న మూర్తిగారు అవకాశం చిక్కింది అదే చాలనుకొని చంగున అందుకున్నాడు. "అది కాదె అత్తయ్యా పెద్దదానివి చూచి సర్టిఫికేటు యియ్యి."

"పెద్దదాన్ని నా పెత్తనం పేలాలయినట్లుంది."

"నీ పెత్తనాని కేమె అత్తయ్యా సర్వ [illegible] కుళాధికారిణివి." ఇంత పెద్దమాట వుపయోగించా ననేమో మరి హైమవంకచూచి చిరునవ్వు

నన్నారు మూర్తిగారు. ఆమె ఆ భాషలోనే సమాధానం యిచ్చినట్లుంది. పాయమ్మకు ఇదంతా నాటకంలా వుంది. అంమలో మాటవస్తే గొంతుకోసుకుంటాననే రకంగూడాను. అసలే ప్రాక్టీసులేనివాడు. అందులో పెండ్లాంమాట విని యీ కరువుకాలంలో పెద్దవాండ్లకు తెలియకుండా ఖరీదుగల చీర కొని పెట్టేవాడా అనుకుంది. నిరంకుశాధికారిణివంటం పై పెచ్చు నవ్వటం మరీ వుద్రేకం కలిగించినవి. నమిలి మింగుదామా నమలకుండానే మింగుదామా అనే ధర్మంలో పడ్డది. మొదటి దఫాకు మెల్లగానే పోనిద్దాం అనుకుంది.

"నే సర్టిఫికేటు యిచ్చేదాన్నా ? ఈ దాగుడు మూతలు అంకుశంలేకనేగా. అయినా నా కెందుకులే."

"అదికాదే లంకావారి చిన్నబ్బాయి కనపడ్డాడే యివ్వాళ. జ్ఞాపకంలేదూ యెవరో?"

"జూనియర్ ఫీజు బాకీవున్నాయనేనా. మన యింటికిగూడా చాలాసార్లు వచ్చాడుకాదూ మీతో మాట్లాట్టానికి."

పాయమ్మ కర్థమైంది. ఆయనిచ్చిన పైకం కాస్తా కర్చేసి చీర కొన్నాడనుకుంది.

"అయితే ఏం?" అంది.

"ఆయన చీరె లమ్ముతాడు. నిన్న యీవూరికి వచ్చాట్ట. ఇవాళ నాకు కనుపించాడు బజార్లో. బాకీ ఫయిసలుచేస్తేగాని వీల్లేదన్నా. నాదగ్గిర పైకం లేదు. ఉన్నదంతా కర్చేసి చీరెలు తీసుకపోతున్నానన్నాడు. కాదు కూడదంటే యీచీరె యిస్తానన్నాడు. అసలే దివాలాకోరు అందుకని ఇదే పట్టు కొచ్చానే."

"అవును నిజమే టవున్లో యీమాటే అనుకుంటున్నారు."

"కాదంటావా ? డబ్బిస్తే నీకు చెప్పనంటే అత్తయ్యా?"

"అయినా నా కెందుకులే. మీ యిష్టం. లేని పోని ఆశలు కాకపోతే నాతోనే చెప్పేవాడవైతే నాకుచూపి మరీ—"

"నీవు లేవే అత్తా."

"చచ్చిపోలేదురా నాయినా హాయిగావుండే వాండ్లు 'ఆ' 'ఊ' అనేవాండ్లు లేకుండా. తెలివి తక్కువ మొద్దును కాదురా పండగపూటవా డెవడోవచ్చి పాతబాకీక్రింద నీ భార్యాగారికి పట్టు చీర యిచ్చాడంటే నమ్మటానికి."

"నిజంగానే అత్తా నే నెన్నడేనా అబద్ధం చెప్పాను ?"

"మీ పెద్దలకో నమస్కారం వూరుకోరా... .. అది అడిగింది. నీవు తెచ్చిపెట్టావు. మధ్య నాదే ముంది బోడిపెత్తనం."

"అమ్మతోడు నే నడగలేదండి పిన్నీ."

"అమ్మతోడు మేనమామ. అంతటితో వూరుకో నిన్నెవరు పిల్చారు."

"నిజంగానె అత్తా అది అడగలేదే."

"వత్తాసీకి వచ్చావురా నాయనా. నెత్తి కెక్కించుకో నే వద్దన్నానా."

"పిన్నిగారూ! పండగపూటా యీ గోల."

"గోలేనే! నే వదిలితేనేగాని యీఫీడ వదలదు కదూ! ఎంత నంగనాచివే తల్లీ. ఆడించు. ఇంకా రెండురోజులు పోతే నన్ను నడిపిస్తావు. గోలమనిషి నేనె మరి మా అమ్మ అసలే ఆమాయికురాలు. మా నాన్న అంతకంటే. ఇక నేనా—?"

"మా నాన్న సంగతి దేనికి, పట్టుమని పంచ తిని యెరుగడు మీ యింట్లో. వూరికే వాండ్ల వుసురు పోసుకుంటావు."

"పెదుదుగానిలే మా తల్లివి. ఇదంతా దానికే గాదూ. వాన్ని సీవాన్ని చేసుకున్నావు. బుట్టలో పెట్టి ఆడిస్తున్నావు."

"వూరుకోండర్రా ప్రక్కవాళ్లువింటే పరువుపోతుంది. అత్తా! అన్నం పెట్టవే."

"అన్నం పెట్టమనకపోతే ఆ.........నోరు మూయించలేవు. సిగ్గులేదూ! దాన్ని నామీది కావిధంగా తరిమి చూస్తున్నావు."

"పిన్నీ!...............అంటం మంచిది కాదు. మాటకుమాట వస్తుంది. ఆమాట తిన్నవారు మా వంశంలోనే లేరు.

"మా వంశంలో వున్నారా!"

"అత్తా! ఓ చీరెమీద ఇంత రాద్ధాంతం దేనికి. పదయింది అన్నంపెట్టవే. ఇదుగో ఓయ్ నీవూరుకో."

"చీరె! అలాంటిది దీని అమ్మ గట్టిందా? అమ్మమ్మ కట్టిందా? అన్నీ నేర్పుతున్నావ్. మా ప్రాణం తీయిస్తున్నావ్."

"మహాతల్లివి! నీవు కట్టావులే. మాటమాటకి మావాళ్ల నంటావు. ఎందరనన్నావో అనుభవిస్తున్నావు అభమూ శుభమూ లేకుండా. వారు తెచ్చారు. నే కట్టుకున్నా. మధ్య నీ కెందుకు ఈ కడుపుమంట?

"వారు నీవారు! ఏంబారలు చాపుతావె దొమ్మరి ......."

"మీ రూరుకుంటారా లేదా. ఓసేయి నీ వెళ్లి ఆఫీసులో కూచో. అత్తా నీకు నమస్కారం పెడ్తా. నీవన్నా వూరుకోవమ్మా. నలుగురూ వింటే నవ్వుతారు. ఇదుగో ఇంకా వెళ్లవేం?"

ఆమాత్రానికేనా వా రూరుకుండేది. అటుయేడు ఇటుయేడు తరాలవారు బైటికొచ్చారు. మూర్తిగారి పుణ్యఫలంచేత చేతులుమాత్రం కలవలా. ఈగోలతో ఇంటివారి పిల్లవాడు లేచి యేడుపు ప్రారంభించాడు. వాళ్లూ మొదట తమాషాగా వింటున్నారుగాని శృతిమించి రాగానపడగా కోపంవచ్చింది. తనయింట్లో వాళ్లూగూడా నేర్చుకుంటారేమో అనుకున్నాడాయన. ఎందుకయినా మంచిదని వచ్చి నోరుచేసుకున్నాడు. మూర్తిగారికి తల కొట్టేసినట్లయింది. ఆమర్నాడే తండ్రిగారికో మహాజరు పిటీషను పెట్టుకున్నాడు: ప్రాక్టీసు లేదు — ఇంట్లో తవ్వ్యాలతో చస్తున్నా — ఏదో ఓ దోవచూపమని ప్రార్థించాడు. రామమూర్తిగారు అన్నివిధాల ఆలోచించారు. ఇలాగైతే ప్రాక్టీసు, పేరు మాట ఏలావున్నా పిల్లవాడు చెడిపోతాడనుకున్నారు. తక్షణంవచ్చి తమకు దాపునున్న సబుకోర్టులో ప్రాక్టీసు పెట్టమన్నారు. తాముకూడా వుంటామన్నారు. బతికామురా బాబూ అనుకున్నాడు మూర్తిగారు. రెక్కలు కట్టుకొని పట్నంనుంచి లేచారు. ప్రస్తుతం మాఇంట్లోనే లేండి వారు వుంటం. విశేషాలేమన్నావుంటే మరోతూరి వ్రాస్తా.

---

## దారిద్ర్యము

జి. జోసపుకవిగారు

దీపించునిర్మల తేజంబులుడిగించు, రక్తమాంసముల సారములఁబిండు
మానాభిమానసంపద గంగపాల్సేయు, భయపిశాచమునకుఁబట్టి యిచ్చు
నిండు చింతావారినిధిమధ్యమునముంచు, సాహసబీజంబు సమయఁజేయు
అతులపాపజ్వాల లంకురమెత్తించు పదుగురిలోనగు బాటుజేయు

బహుదురాలోచనుల కెల్ల పాడిపంట
అసదృశాహ్లాద జలనిధికౌర్యదహన
మసమదౌర్మార్గ్యమునకు నెయ్యపువయస్య
పృథివి వర్ణింపతరమె దారిద్ర్యమహిమ.